సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం । 16 । మార్చి । 2025



వైభవంగా రథోత్సవం
మన్యంకొండ అలివేలు మంగతాయారు రథోత్సవం వైభవంగా జరిగింది.
వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-34 (ఆదివారం సాయంత్రం)
సహర్ 5-04 (సోమవారం తెల్లవారుజామున)

వాతావరణం
గరిష్టం/కనిష్టం 39.9 /18.0
ఉదయం నుంచే ఎండ ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉత్సాహంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో ఈనెల 23న జరిగే రాష్ట్రస్థాయి అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను శనివారం జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహించారు. అండర్–14, 16, 18, 20 విభాగాలతో పాటు పురుషులు, మహిళలకు 100 మీ., 400 మీటర్ల పరుగు, జావెలిన్ త్రో ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో కోచ్‌లు ఆనంద్, సునీల్ కుమార్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం సంయుక్త కార్యదర్శులు సి.శ్రీనివాసులు, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూలుపై దృష్టి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఈ ఆర్థిక సంవత్సరం గడువు దగ్గర పడుతుండటంతో ఆస్తి పన్ను వసూళ్లపై స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు దృష్టి పెట్టారు. శనివారం నగరంలోని ఆయా డివిజన్ల పరిధిలో ఎనిమిది బృందాలు తిరిగి ఏకంగా రూ.29 లక్షల మేర రాబట్టగలిగారు. ఇక మార్కెట్ ఏరియాలోని వివిధ దుకాణదారులు నాలుగేళ్లుగా సుమారు రూ.పది లక్షల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో తాజాగా పది షాపులను సీజ్ చేశారు. అలాగే పాతబస్టాండు వద్ద ఆర్టీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంక్ సైతం రూ.5.57 లక్షల బకాయి పడింది. దీనిని ఓ ప్రైవేట్ వ్యక్తి లీజుకు తీసుకుని నడిపిస్తుండగా మున్సిపల్ అధికారులు అక్కడికి వెళ్లి సీజ్ చేశారు. చివరకు ఈనెల 18వ తేదీలోగా మొత్తం చెల్లిస్తామని అతను చెప్పడంతో తిరిగి తెరిచారు. కార్యక్రమంలో ఆర్ఓ మహమ్మద్ ఖాజాతో పాటు ఏడుగురు ఆర్ఐలు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో మరిన్ని ఏఐ ల్యాబ్‌లు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని రాంనగర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ల్యాబ్‌ను డీఈఓ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులకు ఏఐ తరగతులు బోధించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పది ప్రభుత్వ పాఠశాలల్లో ల్యాబ్‌లను ఏర్పాటు చేసిందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు ఏఐ ల్యాబ్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ల్యాబ్‌లు ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, అంజలీదేవి పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ.6,871

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం వేరుశనగకు క్వింటాల్ గరిష్టంగా రూ.6,871, కనిష్టంగా రూ.5,869 ధరలు లభించాయి. అదేవిధంగా కందులు రూ.6,971, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,321, కనిష్టంగా రూ.2,127, జొన్నలు రూ.3,817, ఆముదాలు గరిష్టంగా రూ.6,125, కనిష్టంగా రూ.6,060, పత్తి రూ.5,300 ధరలు లభించాయి. దేవరకద్ర మార్కెట్‌లో కందులు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,041గా ఒకే ధర నమోదైంది.

ఆవిష్కరణలకు గుర్తింపు

పీయూలో పరిశోధనలపై దృష్టి సారించిన అధ్యాపకులు

- ఇప్పటికే కెమిస్ట్రీ విభాగంలో పూర్తిస్థాయి పేటెంట్ హక్కులు
- డిజైన్ విభాగంలో రెండు, యుటిలిటీలో ఒకటి, పరిశీలనలో మరొకటి..
- గుర్తింపు వస్తే పూర్తిస్థాయిలో కొత్త ఆవిష్కరణలకు అవకాశం



పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకులు బోధనపైనే కాకుండా.. పరిశోధనలపై సైతం దృష్టిసారించారు. గత కొన్నేళ్లుగా సాగుతున్న పరిశోధనలతో పలు అంశాల్లో పేటెంట్ రైట్స్ సైతం సాధించారు. మొత్తం కెమిస్ట్రీ విభాగంలో అధ్యాపకులు పర్యావరణహిత రీ ఏజెంట్లు, ఎలాంటి కెమికల్స్ లేకుండా సాధారణ పర్యావరణానికి అనుకూలమైన విధానంలో తయారు చేయడం యూనివర్సిటీ చరిత్రలో ఓ మైలురాయి. దీనికి పేటెంట్ రైట్ రావడంతో టీచర్స్ అసోసియేట్ షిప్ ఫర్ రీసెర్చ్ ఎక్సలెన్స్ ఫెల్లోషిప్ అధ్యాపకులు చంద్రకిరణ్ ఎంపికయ్యారు. మ్యాథ్స్ విభాగంలో అధ్యాపకులు రిమోట్ కంట్రోల్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ తయారీ, రోలర్ స్టాంప్ తయారీకి డిజైన్ విభాగంలో పేటెంట్ రాగా.. స్ట్రెచింగ్ షీట్‌పై కాసన్ నానోఫ్లూయిడ్స్ ప్రవాహంలో వేడి, ద్రవ్యరాశి బదిలీని పంచే పద్ధతి వంటివి ఇటీవలే ఆవిష్కరించారు. ఇవి పరిశీలన దశలో ఉండగా.. మరో ఆవిష్కరణను ఎంబీఏ అధ్యాపకులు ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్రిడెక్టర్ వంటి పరికరాలు ఆవిష్కరించారు. దీంతో ఇటు అధ్యాపకులు రీసెర్చ్ స్కాలర్స్, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ విద్యార్థులు పరిశోధనల అనంతరం ఒక కొత్త యంత్రాల ఆవిష్కరణతో జరిగే ప్రయోజనం వంటి అంశాలపై దృష్టిసారించారు.

– మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

కీలకంగా పర్యావరణహిత రీ ఏజెంట్లు



పేటెంట్ రైట్ సర్టిఫికెట్ చూపిస్తున్న అధ్యాపకులు చంద్రకిరణ్, రీసెర్చ్ స్కాలర్ స్వాతి (ఫైల్)

రసాయన పరిశ్రమలు, ట్యాబ్‌లెట్లు, ఇతర పరిశ్రమల్లో కెమికల్స్ తయారు చేసేందుకు రీ ఏజెంట్లు ఎంతో కీలకంగా మారనున్నాయి. ఇందులో రీ ఏజెంట్లు మొదట తయారు చేసేందుకు పెద్ద పరిశ్రమలను స్థాపించడం, పెట్టుబడి, ఇతర పర్యావరణానికి నష్టం చేసే విధంగా ప్రక్రియ చేయాల్సి ఉంటుంది. కానీ, పీయూ కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు చేసిన ప్రయోగాలు పూర్తిగా పర్యావరణ హితం కానున్నాయి. సాధారణ గది ఉష్ణోగ్రతల వద్ద చిన్న గదుల్లో సైతం రీ ఏజెంట్లను శాస్త్రీయ పద్ధతిలో తయారు చేసే విధానాన్ని కొనుగొనడంతో మూడు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం పేటెంట్ రైట్ ప్రకటించింది. ఇందులో అధ్యాపకులు చంద్రకిరణ్, సిద్ధరామగౌడ్, రీసెర్చ్ స్కాలర్ స్వాతి భాగస్వాములయ్యారు. వీటితోపాటు మరో 20 రీఏజెంట్‌లో పరిశోధనలో ఉన్నాయి.

రిమోట్ కంట్రోల్‌తో ఆక్సిజన్..

పీయూ మ్యాథ్స్ విభాగంలో పేటెంట్ రైట్స్ దృష్టిసారించింది. ఇందులో డిజైన్ విభాగంలో శ్వాసకోశ రోగులకు ఆక్సిజన్ థెరపీ అందించేందుకు రిమోట్ కంట్రోలర్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ రూపొందించారు. ఇందులో పేషెంట్ ఆరోగ్యం, పరిస్థితి తదితర అంశాలను కాన్సన్‌ట్రేటర్ పరిశీలించిన తర్వాత రోగికి ఆక్సిజన్ అందిస్తుంది. అయితే రోగికి మ్యానువల్ పద్ధతిలో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేషన్ ద్వారా ఆక్సిజన్ సరఫరా చేయాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఉండే నేపథ్యంలో కేవలం రిమోట్ కంట్రోల్ ద్వారా ఆక్సిజన్‌ను అవసరం మేరకు అందిస్తే ఇబ్బందులు తప్పనున్నాయి. ఇందులో పలు యూనివర్సిటీలకు చెందిన అధ్యాపకులు శంకర్‌రావు, మధు, భారతి, సత్తమ్మ, లిపిక, అరుంధతి పాలుపంచుకున్నారు.



డిజైన్ విభాగంలో పేటెంట్ పొందిన మ్యాథ్స్ అధ్యాపకుడు మధును సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప (ఫైల్)

- రోలర్ స్టాంప్ పరికరాన్ని మ్యాథ్స్ విభాగం అధ్యాపకులు మధు ఆవిష్కరించగా.. పేటెంట్ రైట్ లభించింది. గణితం అంటే భయపడే పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈ పరికరం ఎంతో ఉపయోగపడనుంది. దీని ద్వారా గణిత ప్రక్రియలను సులభతరం చేసేందుకు అవకాశం ఉంది.
- రసాయన శాస్త్రంలో కెమికల్స్ ప్రాసెసింగ్, ఏరో స్పేస్, బయో మెడికల్ ఇంజినీరింగ్ పారిశ్రామిక అనువర్తనాల్లో వేడి, ద్రవ్యరాశి బదిలీలో కీలకపాత్ర పోషిస్తున్న స్ట్రెచింగ్ షీట్‌పై కాసన్ నానో ఫ్లూయిడ్ ప్రవాహంలో వేడి, ద్రవ్యరాశి బదిలీని పెంచే పద్ధతిలో కూడా మ్యాథ్స్ విభాగంలో పరిశోధనలు పూర్తి కాగా పేటెంట్ రైట్ పరిశీలనలో ఉన్నాయి.

నానో టెక్నాలజీ బ్యాండేజీ..

సాధారణంగా గాయాలు త్వరగా తగ్గేలా సూక్ష్మజీవులను చంపేందుకు వినియోగించే బ్యాండేజీలు కొత్త విధానాన్ని ఆవిష్కరించడంలో పీయూ బాటనీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు శివకుమార్‌సింగ్ సఫలమయ్యారు. సూక్ష్మజీవులను చంపే బ్యాండేజీలో చెట్ల రసాయనాలను వినియోగించి నానోపార్టికల్స్ ఆవిష్కరించారు. వీటి ప్రభావం సూక్ష్మజీవులపై ఎలా ఉంటుందో నిరూపించారు. ఈ ప్రయోగంలో బెంగళూరుకు చెందిన సైంటిస్టులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ ప్రయోగానికి 2023లో పేటెంట్ రైట్ అందుకున్నారు.



శివకుమార్‌సింగ్‌ను సన్మానిస్తున్న వీసీ శ్రీనివాస్ తదితరులు



అర్జున్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్ తదితరులు (ఫైల్)

కీలకంగా స్టాక్ మార్కెట్ ప్రిడిక్టర్..

పీయూ ఎంబీఏ విభాగంలో ఆన్‌లైన్ ట్రేడింగ్ చేసే వారికి స్టాక్ మార్కెట్ ప్రిడిక్టర్ భవిష్యత్‌లో కీలక పరికరంగా మారే అవకాశం ఉంది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే వారికి మంచి సాధనంగా మారుతుంది. దీని ద్వారా స్టాక్ మార్కెట్‌ను పరిశీలించడానికి ఏఐని వినియోగించనున్నారు. ఇది మార్కెట్ అంచనా వేసేందుకు ఇంటర్నెట్, సోషల్ మీడియాలో ఆర్థికపరమైన వార్తలు, మీడియా కథనాలను అంచనా వేసి ఏ కంపెనీ షేర్ మార్కెట్‌లో లాభాలు గడిస్తాయనే అంశంపై మిషన్ లెర్నింగ్, ఆల్గరిథమ్ ఆధారంగా సమాచారం ఇస్తుంది. ఇది అందించిన సమాచారం మేరకు ఏ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు అనే అంశంపై సమాచారం ఇస్తుంది. ఇందులో పలు కళాశాలలకు చెందిన సురేష్‌కృష్ణ, కన్నమ్మల్, గాయత్రి, అర్జున్‌కుమార్, కిరుబదేవి, సుమందీశ్వర్, రాజామణి పాల్గొనగా.. పీయూ అధ్యాపకులు అర్జున్‌కుమార్ కీలకంగా వ్యవహరించారు.

ప్రాధాన్యం ఇస్తున్నాం..



యూనివర్సిటీలో అధ్యాపకులు, ఇటు రీసెర్చ్ స్కాలర్ ఎంతో ఉత్సాహంగా పరిశోధనలపై దృష్టి సారిస్తున్నారు. ఇటీవల కొన్ని పేటెంట్లు కూడా వచ్చాయి. దీని ద్వారా పీయూకు ప్రాజెక్టులు, రీసెర్చ్ పరమైన అంశాల్లో ముందంజ వేస్తున్నాం. నిర్మాణంలో రీసెర్చ్ ఫెసిలిటీ భవనం ఉంది. అది అందుబాటులోకి వస్తే పీయూ రీసెర్చ్ హబ్‌గా మారనుంది. అందులో పూర్తిస్థాయిలో ల్యాబ్‌లో అధునాతన ప్రయోగ పరికరాలు అందుబాటులోకి తీసుకువస్తాం.

– శ్రీనివాస్, వైస్ చాన్స్‌లర్, పాలమూరు యూనివర్సిటీ

మరింత ఊతం..



యూనివర్సిటీలో రీసెర్చ్‌తో పాటు కొత్త ఆవిష్కరణలకు అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ కృషిచేయడం గొప్ప విషయం. భవిష్యత్‌లో రీసెర్చ్ ఫెసిలిటీ అందుబాటులోకి రానుంది. ఇంజినీరింగ్ కళాశాలకు రెగ్యులర్ అధ్యాపకులు రానున్నారు. దీంతో మరింత రీసెర్చ్ పెరగనుంది. పలు ప్రతిష్టాత్మక సంస్థలతో ఎంఓయూ చేసుకునేందుకు చర్చలు జరుగుతున్నాయి.

– మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పీజీ కళాశాల, మహబూబ్‌నగర్

నైపుణ్య శిక్షణ కేంద్రం అభివృద్ధికి కృషి



నైపుణ్య శిక్షణ కేంద్రం భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ కంట్రోల్స్ సంస్థ డైరెక్టర్ రాజీవ్‌త్రివేది తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డలో నిర్మిస్తున్న నైపుణ్య శిక్షణ కేంద్రం అభివృద్ధికి ప్రముఖ పారిశ్రామికవేత్తల సహకారం తీసుకుంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇక్కడ కొత్తగా ఏర్పాటు చేయనున్న ఈ కేంద్రాన్ని శనివారం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ కంట్రోల్స్ సంస్థ డైరెక్టర్ రాజీవ్ త్రివేదితో కలిసి పరిశీలించారు. ఇందులో విద్యార్థులకు అవసరమయ్యే తరగతి గదులు తదితర అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం మున్సిపల్ నిధులతో క్లాక్‌టవర్ వద్ద వేసిన పవర్ బోరును పరిశీలించారు. ముడా నిధులతో ఆర్ఓ ప్లాంట్, ప్రత్యేక షెడ్ సైతం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డులోని జంతు వధశాల పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌పీలతో సమావేశమయ్యారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీపై దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఆవరణలో నిర్మిస్తున్న కళాభారతి భవనాన్ని తనిఖీ చేశారు. అలాగే కల్వరి గుట్టపై తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తనను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో కలిసిన ఎంబీ చర్చి సంఘం సభ్యులకు హామీ ఇచ్చారు.

ఉన్నత స్థితికి చేరుకోవాలి

మహిళలు కుట్టు శిక్షణలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో కలెక్టర్ బంగ్లా సమీపంలోని వివేకానంద కమ్యూనిటీ హాలు టైలరింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలపాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారు సర్టిఫికెట్ పొందితే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈఈ సంధ్య, మెప్మా ఇన్‌చార్జ్ డీఎంసీ ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

మిడ్జిల్: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతోందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. శనివారం సాయంత్రం మిడ్జిల్‌లో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారానే గ్రామాల్లోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదలకోసం ప్రవేశపెట్టిన ఫలాలు నేరుగా ప్రజలకు అందాలంటే గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు బీజేపీ వారై ఉండాలని సూచించారు. ఇది జరగాలంటే బీజేపీ గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్‌కు చెందిన వెంకటయ్య, బుచ్చయ్య, భీమయ్య, బాలమల్లయ్య, తదితరులు ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, నాయకులు జనార్ధన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, తిరుపతి, నరేష్‌నాయక్ పాల్గొన్నారు.

కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్

- రూ.6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం
- టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్



మాట్లాడుతున్న టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

స్టేషన్ మహబూబ్‌నగర్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లను పూర్తిగా విస్మరించిందన్నారు. పదేళ్లలో పట్టించుకోలేదని, కాని ఎన్నికల సంవత్సరం అరకొరగా ఆర్థికసాయం ఇచ్చి చేతులు దులుపుకుందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సామాజిక విప్లవకారుడని, ఆయన నేతృత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రాజీవ్ యువ వికాస పథకంలో బ్యాంకు లింకేజీతో ఒక్కో లబ్ధిదారుడికి రూ.3లక్షల వరకు ఆర్థికసాయం అందజేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రూ.6 వేల కోట్లతో రాష్ట్రంలో 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు ఈ పథకం కింద లబ్ధిచేకూరుతుందన్నారు. ఈనెల 15న నోటిఫికేషన్ విడుదలైందని, వచ్చేనెల 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఏప్రిల్ నుచి 6 నుంచి మే 31 వరకు లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. జూన్ 2న లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తామని తెలిపారు. మైనార్టీ కార్పొరేషన్‌కు రూ.800 కోట్లు కేటాయించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎంలకు కృతజ్ఞతలు చెప్పారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, నాయకులు ఎన్‌పీ.వెంకటేశ్, సీజే బెనహర్, నాగరాజు, రాములుయాదవ్, పీర్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. రామలింగేశ్వరుడి రథోత్సవం

- కందూర్‌లో మార్మోగిన శివనామస్మరణ
- భారీగా తరలివచ్చిన భక్తజనం

– అడ్డాకుల

వివరాలు 8లో ▸

పండ్లకు భలే గిరాకీ

- ఉపవాస దీక్షలతో పెరిగిన వినియోగం
- రిటైల్‌గా జోరందుకున్న వ్యాపారం
- అమాంతంగా పెరిగిన ధరలు

కొనసాగుతున్న సహాయక చర్యలు



సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అరవిందకుమార్

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో లభ్యం కాని కార్మికుల ఆచూకీ
- కనీసం ఆనవాళ్లు కూడా లభించని వైనం
- హైడ్రాలిక్ పవర్డ్ రోబో పనితీరుపైనే ఆశలు
- డీ1 జోన్ ప్రాంతంలో బలహీనంగా పైకప్పు
- 22 రోజులుగా శ్రమిస్తున్న సహాయక బృందాలు

– అచ్చంపేట/ ఉప్పునుంతల

వివరాలు 8లో ▸

17, 18 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల దీక్ష

మహబూబ్‌నగర్ రూరల్: అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ మోహన్‌రావును కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 17, 18 తేదీల్లో కలెక్టరేట్ ముందు 48గంటల దీక్షలు చేపడుతున్నామన్నారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా ప్రమోషన్ కల్పించి పది నెలల అవుతున్నా వేతనాలు ఇవ్వలేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐతో పాటు గ్రాటివిటీ, పెన్షన్ కల్పించాలని, నూతన విద్యావిధానాన్ని అంగన్‌వాడీల్లో అమలు చేయరాదన్నారు. ఈ దీక్షలకు జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఖమర్ అలీ, సలీమ్, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు సరోజ, గౌసియా, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. అలివేలుమంగ రథోత్సవం



- ఘనంగా గరుడవాహన సేవ
- భక్తి పారవశ్యంతో పులకించిన భక్తులు


అలంకరణలో ఉత్సవమూర్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ అలివేలు మంగతాయారు రథోత్సవం (విమాన రథోత్సవం) శుక్రవారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా సాగింది. ముందుగా శోభాయమానంగా అలంకరించిన గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగతాయారు దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఉంచి సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రోచ్చారణల నడుమ గర్భాలయం నుంచి ప్రధాన ద్వారం మీదుగా ఆలయ ఆవరణలోని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం రంగురంగుల పూలు, విద్యుద్దీపాలు, మామిడి తోరణాలతో ముస్తాబుచేసిన రథంపై ఉంచారు. రథం ముందు కుంభం పోసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తుల గోవింద నామస్మరణలు చేస్తూ ముందుకు లాగారు. సాంప్రదాయ రీతిలో ఆలయం ముందున్న దేవగుండు వద్దకు లాగి తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. రథోత్సవానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. బంగారు ఆభరణాలు, కాగడాలు, విద్యుద్దీపాల వెలుతురులో స్వామి, అమ్మవార్లు ధగధగ మెరిసిపోతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మళ్లీ ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై గర్భగుడి తీసుకొచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ప్రత్యేక అభిషేకం, బలిహరణం, హోమం తదితర పూజా కార్యక్రమాలు కొనసాగాయి.

అశ్వవాహనసేవ..

అలివేలు మంగతాయారు ఆలయంలో శనివారం రాత్రి అశ్వవాహనసేవ నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తుల హరినామస్మరణ, పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురులో అశ్వవాహనం ముందుకు కదిలింది. స్వర్ణాభరణాల అలంకరణలో వేంకటేశ్వరస్వామి సమేత అలివేలు మంగతాయారు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. విశేష దినోత్సవం సందర్భంగా గుట్టపైనున్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద భక్తుల రద్దీ కనిపించింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, పాలక మండలి సభ్యులు వెంకటాచారి, సురేందర్, గోవిందు, అలువేలమ్మ, సుధ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

■ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవం, పూర్ణాహుతి, అవభృతస్నానం, రాత్రికి నాగబలి (నాగవెల్లి), ద్వాదశ ఆరాధన, సప్తావరణాలు, మహా ఆశ్వీరచనం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. దీంతో అమ్మవారి ఉత్సవాలు ముగుస్తాయి.

రమణీయం.. రామలింగేశ్వరుడి రథోత్సవం

- కందూర్‌లో మార్మోగిన శివనామస్మరణ
- భారీగా తరలివచ్చిన భక్తజనం


అలంకరణలో స్వామివారి మూల విగ్రహం


రథోత్సవానికి హాజరైన భక్తజనం

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం అర్ధరాత్రి రమణీయంగా సాగింది. ముందుగా గ్రామం నుంచి రామలింగేశ్వరస్వామి వెండి ముఖం, నాగపడగను మంగళవాయిద్యాలు, డప్పుచప్పుళ్ల నడుమ బాణసంచా కాలుస్తూ భక్తుల శివనామస్మరణతో ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడ పూజారులు వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయం వెలుపలకు తీసుకొచ్చి అలంకరించిన రథంపై ఉంచారు. తర్వాత రథం ముందు పోలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించి రథాంగ హోమం చేసి హారతులిచ్చారు. శనివారం తెల్లవారుజామున అశేష భక్తజనం శివనామస్మరణ చేస్తూ మేళతాళాల మధ్య స్వామివారి రథాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో ముందుకు లాగారు. రథం ముందు భక్తులు భజనలు, కోలాటాలు చేస్తూ అందరిని అలరించారు. రథోత్సవానికి వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ రాజేశ్వరశర్మ, గ్రామపెద్దలు నాగిరెడ్డి, శ్రీహరి, రవీందర్‌శర్మ, దామోదర్‌రెడ్డి, రాములు, బుచ్చన్నగౌడ్, దేవన్నయాదవ్, మనోహర్, సత్తిరెడ్డి, అర్చకులు యాదగిరిశర్మ, తాళ్లపాక రామలింగశర్మ, శివశర్మ, మణికంఠశర్మ, రేవంత్‌శర్మ, వినయ్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

అచ్చంపేట రూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఓ వ్యక్తిపై శనివారం అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని పాతబజార్‌లో సివిల్‌సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా... అనుమానాస్పదంగా ఓ ఆటోలో 18 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ బియ్యం ఎవరివని విచారించగా ఎండీ ఉస్మాన్ అనే వ్యక్తి తెల్ల రేషన్ కార్డుదారుల నుంచి బియ్యం సేకరించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరకు అమ్ముకుంటాడని తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. కాగా కొంతమంది అధికార పార్టీ నాయకులు, అధికారులు కేసు నుంచి అసలు సూత్రధారులను తప్పించే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం.

క్లుప్తంగా

సంప్‌లో పడి చిన్నారి మృతి


నాన్సీ(ఫైల్)

బల్మూర్: అప్పటివరకు అందరిని నవ్విస్తూ ఆడుకుంటున్న చిన్నారి సంప్‌లో పడి దుర్మరణం పాలైన ఘటన మండలంలోని కొండనాగుల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చింత మహేష్, సుస్మిత దంపతులు. వీరికి నాన్సీ(2) అనే కూతురు ఉంది. పక్కనే ఉన్న తాత బాలయ్య ఇంటికి ఆడుకుంటూ వెళ్లింది. అక్కడ చిన్నారిని ఎవరూ గమనించకపోవడంతో ఇంటి ముందు ఉన్న సంప్‌లో పడింది. కొంత సేపటికి గమనించిన కుటుంబ సభ్యులు చిన్నారిని సంప్‌లో నుంచి తీయగా అప్పటికే నీళ్లు మింగి ఊపిరాడక మృతి చెందింది. చిన్నారి మృతితో ఆకుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బావిలో పడి వ్యక్తి..


చంద్రయ్య (ఫైల్)

మిడ్జిల్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మిడ్జిల్ మండలం వేముల గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికుల వివరాల మేరకు.. వేములకు చెందిన రేవల్లి చంద్రయ్య (50) గురువారం రాత్రి గ్రామంలో నిర్వహించిన కాముడి దహనం కార్యక్రమానికి వెళ్లాడు. అర్ధరాత్రి 1గంటకు కాముడి దహనం ముగిసిన అనంతరం బుడిద తీసుకుని వస్తుండగా.. గ్రామ సమీపంలోని ఆలయం వద్ద ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. అతడి కోసం కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో శనివారం గ్రామ సమీపంలోని ఆలయం వద్ద ఉన్న బావిలో శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడికి భార్య కళమ్మ, కుమారుడు శివకుమార్ ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం జడ్చర్ల మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి..


రవీంద్రనాథ్‌రెడ్డి (ఫైల్)

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా నుంచి చెన్నిపాడుకు బైక్‌పై వెళ్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి(38) అనే వ్యక్తి పెద్దపోతులపాడు స్టేజీ సమీపంలో అదుపు తప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌పై అలంపూర్ చౌరస్తా నుంచి స్వగ్రామమైన చెన్నిపాడుకు బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైక్ అదుపు తప్పి కిందపడినట్లు చెప్పారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్యపై కేసు నమోదు

జడ్చర్ల: మండలంలోని కోల్‌బాయితండాకు చెందిన పాత్లావత్ శారద(45) తన ఇంటిలో శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం మేరకు.. కోల్‌బాయితండాకు చెందిన శారద భర్త శంకర్ ఆరేళ్ల క్రితం మృతిచెందగా ఆమె తన కుమారుడు సంతోష్, కోడలు జ్యోతిలతో కలిసి జీవిస్తుంది. అయితే కొడుకు, కోడలు తనను వేధిస్తున్నారని తన తండ్రి మునావత్ తథ్యుతో వాపోయింది. ఈ క్రమంలోనే శారద ఆత్మహత్యకు కుమారుడు, కోడలు కారణమని అనుమానంతో శనివారం ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొనసాగుతున్న సహాయక చర్యలు


సొరంగంలోకి తాగునీరు తీసుకెళ్తున్న సహాయక బృందాలు

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో లభ్యం కాని కార్మికుల ఆచూకీ

- కనీసం ఆనవాళ్లు కూడా లభించని వైనం
- హైడ్రాలిక్ పవర్డ్ రోబో పనితీరుపైనే ఆశలు
- డీ1 జోన్ ప్రాంతంలో బలహీనంగా పైకప్పు
- 22 రోజులు శ్రమిస్తున్న సహాయక బృందాలు


సొరంగంలోకి లోకో ట్రైన్‌లో వెళ్తున్న అన్వి రోబోటిక్ సంస్థ బృందం

అచ్చంపేట/ ఉప్పునుంతల: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికుల కోసం అడుగడుగునా అన్వేషిస్తున్నారు. 22 రోజులు గడుస్తున్నా ఇంత వరకు వారి ఆచూకీ దొరకలేదు. మానవ ప్రయత్నంలో కొంత ఇబ్బందులు ఎదురవుతుండటంతో ఏఐ టెక్నాలజీ ద్వారా అన్వి రోబోటిక్ సంస్థ అభివృద్ధి చేసిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబోకు అనుసంధానంగా 30 హెచ్‌పీ సామర్థ్యం గల పంపు, వాక్యూమ్ ట్యాంకు ద్వారా సహాయక చర్యలు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం వాటిని సొరంగం వద్ద సాంకేతిక పరిజ్ఞానంతో ఇన్‌స్టాలేషన్ చేసే ప్రక్రియ మొదలుపెట్టారు. మరోవైపు సాంకేతిక సమస్యలతో రోబో యంత్రాల పనితీరు ఇంకా ప్రారంభం కాలేదు. డీ2 ప్రదేశం నుంచి డీ1 వరకు సింగరేణి, ఎన్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా, ర్యాట్ హోల్ మైనర్స్ ఇతర సహాయక బృందాలు మట్టి, బురద తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. టీబీఎం ఎర్త్ కట్టర్ ఉన్న ప్రాంతం పూర్తిగా 40 అడుగుల మేర కూరుకుపోయింది. అక్కడి వరకు మనుషులు వెళ్లి సహాయక చర్యలు చేపట్టడం ఇబ్బందికరంగా ఉంది. టీబీఎం విడి భాగాలను ప్లాస్మా కట్టర్‌తో తొలగిస్తున్నారు. డీ1 డేంజర్ జోన్ ప్రాంతంలో పైకప్పు బలహీనంగా ఉండటంతో కాంక్రీట్ సెగ్మెంట్ కూడా పడిపోయే పరిస్థితి గమనించి సింగరేణి గనుల్లో ఉపయోగించే టైగర్ కారడ్స్ కలప దుంగలను సపోర్టుగా చేసుకుంటూ తవ్వకాలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు వీటిని నాలుగు చోట్ల ఏర్పాటు చేశారు. వీటికి సుమారు 40 టన్నుల బరువు ఆపగలిగే శక్తి ఉంది. ప్రమాదం జరిగే ముందు శబ్దం వస్తుందని, దీని వల్ల కార్మికులు సురక్షితంగా తప్పించుకునే అవకాశం ఉంటుందని సింగరేణి కార్మికులు వెల్లడించారు. డీ1 ప్రదేశానికి వెళ్లడానికి ఇంకా 30 మీటర్ల మట్టిని తొలగిస్తే సహాయక బృందాలు అక్కడికి చేరుకుంటాయి. డీ1 వద్దకు చేరుకుంటే తప్ప తప్పిపోయిన కార్మికుల ఆచూకీ లభ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. డీ1 వద్ద పూర్తిస్థాయిలో మట్టిని తీసేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. మరో రెండు, మూడు రోజుల్లో ఆచూకీ లభ్యమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

మార్గనిర్దేశనం చేస్తున్నాం..

ప్రమాద ప్రదేశంలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం సొరంగంలోని పరిస్థితులపై కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌తోపాటు సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. సొరంగంలో జరుగుతున్న పురోగతిపై సమీక్షించి అవసరమైన మార్పులను అమలు చేస్తూ మార్గనిర్దేశనం చేస్తున్నట్లు వెల్లడించారు. సహాయక బృందాల మధ్య సమన్వయంతో పనులు చేపడుతున్నామని, మరింత వేగవంతం చేసేందుకు అత్యాధునిక రోబోటిక్ పద్ధతులను ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. అన్వి రోబోటిక్ సంస్థ అభివృద్ధి చేసిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో ద్వారా 30 హెచ్‌పీ సామర్థ్యం గల పంపుతో అనుసంధానమైన వాక్యూమ్ ట్యాంకు ఉపయోగించి నీటితో కూడిన బురద, మట్టిని తొలగించనున్నట్లు తెలిపారు. సొరంగంలోని నీటిని తొలగించేందుకు డీ-వాటరింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా ఆధునిక పరికరాలు ఉపయోగించి శరవేగంగా సహాయక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రత్యేకంగా ఆక్సిజన్ సరఫరా, వైద్యసేవలు, ఆహారం, మంచినీరు వంటి అవసరాలను నిరంతరం అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రాధాన్యంగా సహాయక బృందాల భద్రతకు దృష్టిలో పెట్టుకుని అత్యవసర అవసరాలపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. అనంతరం లిక్విడ్ రింగ్ వాక్యూమ్ పంపు, వాక్యూమ్ ట్యాంక్‌తో కూడిన మిషన్ పనితీరు పరిశీలించారు.

పండ్లకు భలే గిరాకీ

- ఉపవాసదీక్షలతో పెరిగిన వినియోగం
- రిటైల్‌గా జోరందుకున్న వ్యాపారం
- అమాంతంగా పెరిగిన ధరలు


దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పండ్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్ మాసంలో పండ్లకు గిరాకీ ఎక్కువగా ఉంటోంది. మిగతా రోజుల కంటే ఈ మాసంలో పండ్ల వినియోగం అధికంగా ఉండడంతో ధరలు కూడా అంతేస్థాయిలో ఉన్నాయి. అరటి పండ్ల డజన్ ధర గత వారంతో పోలిస్తే రూ.5 నుంచి రూ.10 వరకు పెరిగింది. ద్రాక్ష పండ్లు అయితే కిలో రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ద్రాక్ష పండ్ల ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు అంటున్నారు. రంజాన్ మాసంలో ఎక్కువగా వినియోగించే కర్బుజా (పుచ్చకాయ) పండు కిలో రూ.20 నుంచి రూ.25 వరకు విక్రయిస్తున్నారు. రిటైల్ మార్కెట్లో పండ్ల విక్రయాలు జోరందుకున్నాయి. రంజాన్ ఉపవాసదీక్షలో ముస్లింలు రోజు సాయంత్రం ఇఫ్తార్ వేళ పండ్లు ఎక్కువగా తీసుకుంటారు. యాపిల్, ఖర్జూర, పుచ్చకాయలు, పైనాపిల్, దానిమ్మ, ద్రాక్ష, బత్తాయి, బొప్పాయి, అరటి, సపోట వంటి పండ్ల వినియోగం పెరగడంతో వీటి ధరల్లో రోజురోజుకు మార్పు కనిపిస్తుంది. ముస్లింలకు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులకు భారీఎత్తున పండ్లు అవసరమవుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని పండ్ల ధరలను అమాంతంగా పెంచేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్, అశోక్ టాకీస్ చౌరస్తా, జనరల్ ఆస్పత్రి, న్యూటౌన్, క్లాక్‌టవర్, అంబేడ్కర్ చౌరస్తా, పద్మావతికాలనీతోపాటు ఇతర ప్రాంతాల్లో పండ్ల స్టాళ్లను ఏర్పాటు చేశారు. రూ.20 నుంచి 25 వరకు ఉన్న యాపిల్ రంజాన్ మాసంలో రూ.30 నుంచి 35 వరకు, ఆరెంజ్ పండ్లు డజన్ ప్రకారం రూ.180 నుంచి 200 వరకు అమ్ముతున్నారు.

మార్కెట్లో వివిధ రకాల పండ్ల ధరలు

యాపిల్	రూ.25-30(ఒకటి)
ద్రాక్ష	రూ.80-100(కిలో)
దానిమ్మ	రూ.25-30(ఒకటి)
బత్తాయి	రూ.15-20(ఒకటి)
బొప్పాయి	రూ.50-60 (కిలో)
ఖర్బూజ	రూ.20-25 (కిలో)
అరటి	రూ50-60(డజన్)
సపోట	రూ.40-50 (కిలో)

ధరలు అందరికీ అందుబాటులో ఉండాలి



రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల సందర్భంగా పండ్ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈసారి కూడా పండ్ల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. పెరిగిన ధరలతో పండ్లను కొనుగోలు చేయలేని పరిస్థితి. పండ్ల ధరలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉంటే బాగుంటుంది.

– జహంగీర్‌బాబా, సద్దల్‌గుండు, మహబూబ్‌నగర్

దారిదోపిడీకి యత్నించిన ముఠా అరెస్ట్




వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ , స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

- 10 తులాల బంగారం, 22 తులాల వెండి ఆభరణాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిననాగర్‌కర్నూల్ ఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం: జల్సాలకు అలవాటుపడి దారి దోపిడీకి యత్నించిన ఓ ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. వనపర్తికి చెందిన బొల్లెమోని బాబు, బొల్లెమోని అంజి, పుట్టపాకుల శ్రీకాంత్, హైదరాబాద్‌కు చెందిన నందిమళ్ల హరిగణేశ్, యాత రవి, పెంట్లవెల్లికి చెందిన గిరిధర్‌నాయుడు, సాయికుమార్, హరికృష్ణ, అఖిల్ జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతుండేవారు. పెంట్లవెల్లికి చెందిన రాజవర్ధన్, వెంకటేశ్వర్లు, రమేష్, రాఘవేంద్రాచారి బంగారు వ్యాపారులు. వీరంతా ఈ నెల 6న బంగారు కొనుగోలుకు హైదరాబాద్ బయలుదేరారు. నిందితుడు సాయికుమార్ ఈ సమాచారాన్ని బొల్లెమోని బాబుకు అందించడంతో పాటు హరికృష్ణ, గిరిధర్ నాయుడుకు ఓ అద్దె కారు, సెల్‌ఫోన్ అప్పగించి బంగారు వ్యాపారస్తుల కారు వెంటే వెళ్తూ ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. ఆ వ్యాపారులు హైదరాబాద్‌లోని కాళీకమాన్ వద్ద బంగారు కొనుగోలు చేసి బయలుదేరగా నిందితులు మిగతా వారిని అప్రమత్తం చేయడంతో పాటు వారి వెంటే వచ్చారు. కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి శివారు కేఎల్ఐ వంతెన వద్ద స్వామి, అంజి రాళ్లు అడ్డుపెట్టడంతో పాటు సిమెంట్ దిమ్మెలను, అఖిల్ తల్వార్‌ను చేతిలో పట్టుకోవడంతో పాటు హరిగణేష్, రవి, శ్రీకాంత్ రోడ్డు పక్కన నిలిచి ఉన్నారు. బంగారు వ్యాపారుల కారు అక్కడికి చేరుకోగానే నిందితులు కారుపై సిమెంట్ దిమ్మెలతో దాడి చేసేందుకు యత్నించగా అప్రమత్తమైన డ్రైవర్ చాకచక్యంగా అక్కడి నుంచి వేగంగా తప్పించుకొని వెళ్లిపోయారు. బంగారు వ్యాపారి రాజవర్ధన్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టారు. శుక్రవారం రాత్రి కొల్లాపూర్‌లో పెట్రోల్‌బంక్ వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా బొల్లెమోని బాబు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించడంతో పాటు మిగతా వారి సమాచారం ఇవ్వడంతో ఏడుగురిని అరెస్టు చేశారు. వీరంతా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 24 చోట్ల చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి వేర్వేరు దొంగతనాలకు సంబంధించి 10 తులాల బంగారు, 22 తులాల వెండి ఆభరణాలు, దారి దోపిడీకి యత్నించిన కారు, రెండు మోటారు సైకిళ్లు, ఏడు సెల్‌ఫోన్లు, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని.. కోర్టు అనుమతితో మరోమారు పోలీస్ కస్టడీకి తీసుకొని విచారిస్తామని చెప్పారు.

షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం

రూ. 3లక్షల ఆస్తినష్టం

మక్తల్: షార్ట్ సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధమైన ఘటన మక్తల్ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఊట్కూరు మండలం తిప్రాస్‌పల్లికి చెందిన అశోక్ మక్తల్‌లోని సంగం బండ రోడ్డులో బట్టల షాపు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే శనివారం రాత్రి 8 గంటలకు షాపును మూసివేసి ఇంటికి బయలుదేరారు. అతడు వెళ్లిన కొద్ది సేపటికే షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న అశోక్ అక్కడికి చేరుకొని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే దుకాణంలోని సగానికి పైగా వస్త్రాలు కాలిపోయాయి. దాదాపు రూ. 3లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. దగ్ధమైన షాపును సీఐ రాంలాల్, ఎస్‌ఐ బాగ్యలక్ష్మీరెడ్డి పరిశీలించారు.


దగ్ధమైన వస్త్ర దుకాణం

తాళం వేసిన ఇంట్లో చోరీ

బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లిలో కృష్ణమోహన్ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న కృష్ణమోహన్ ఇంటికి తాళం వేసి శుక్రవారం యాదాద్రికి వెళ్లారు. శనివారం తిరిగి ఇంటికి వచ్చి చూసే సరికి తాళం తీసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా మూడున్నర తులాల బంగారం, రూ.50 వేలు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పక్కా భవనానికి మోక్షమెప్పుడో?

- వెన్నాచేడ్ పశువైద్య కేంద్రం భవనానికి గ్రహణం
- అసంపూర్తిగా నిలిచిన నిర్మాణం
- అంగన్‌వాడీ భవనంలో కార్యకలాపాలు
- పూర్తిస్థాయి సేవలకు విఘాతం



వెన్నాచేడ్‌లో అసంపూర్తిగా నిలిచిన పశువైద్య కేంద్రం భవన నిర్మాణం

గండేడ్: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది వెన్నాచేడ్ పశువైద్య కేంద్రం పరిస్థితి. రూర్బన్ పథకం కింద రూ. 12లక్షలతో పశువైద్యశాల భవన నిర్మాణం ఆరేళ్ల క్రితం చేపట్టగా.. సంబంధిత అధికారుల అలసత్వం, గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా అసంపూర్తిగా నిలిచిపోయింది. ఇక గత్యంతరం లేక అంగన్‌వాడీ భవనంలో పశువైద్య కేంద్రాన్ని తాత్కాలికంగా కొనసాగిస్తున్నారు. దీంతో జీవాలకు పూర్తిస్థాయి సేవలు అందని దుస్థితి నెలకొంది. చాలీచాలని భవనంలో పశువైద్య సిబ్బంది, రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. గండేడ్ మండలంలో 27 గ్రామపంచాయతీలు ఉండగా.. 4,141 ఆవులు, ఎద్దులు, 4,370 బర్రెలు, దున్నలు, 39,705 గొర్రెలు, 8,481 మేకలు ఉన్నాయి. వీటికి సేవలు అందించేందుకు రెండు పశువైద్య కేంద్రాలు ఉండగా.. రెండు రూరల్ లివ్ స్టాక్ యూనిట్లు ఉన్నాయి. గండేడ్, బల్సుర్‌గొండ, పెద్దవార్వాల్ పశువైద్య కేంద్రాలకు పక్కా భవనాలు ఉండగా.. వెన్నాచేడ్ లివ్ స్టాక్ యూనిట్‌కు మాత్రం పక్కా భవనం నేటికీ సమకూరడం లేదు.

శిథిల భవనం నుంచి అంగన్‌వాడీ కేంద్రంలోకి

వెన్నాచేడ్ పశువైద్యశాల పాత భవనాన్ని దాదాపు 50ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో చినుకు పడితే చిత్తడిగా మారేది. కనీసం పశుగ్రాసం విత్తనాలు, పశువులకు సంబంధించిన మందులు దాచిపెట్టుకునే పరిస్థితి లేకుండాపోయింది. శిథిల భవనంలో బిక్కుబిక్కుమంటూ నెట్టుకొచ్చారు. రెండేళ్ల క్రితం అది పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అక్కడి నుంచి పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోకి మకాం మార్చారు. ప్రస్తుతం అక్కడే పశువులకు చికిత్సలు అందిస్తున్నారు. ఇది రోడ్డుపై ఉండటంతో పశువులకు చికిత్సలు అందించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెన్నాచేడ్‌తో పాటు జిన్నారం, చెలిమిల్ల, జక్లపల్లి, లింగాయిపల్లి, కప్లాపూర్, గోవింద్‌పల్లి, బైస్‌పల్లి గ్రామాలన్నీ వెన్నాచేడ్ కేంద్రం పరిధిలోకి వస్తాయి. ఆయా గ్రామాల్లో 1,634 ఆవులు, ఎద్దులు, 1,363 బర్రెలు, దున్నలు, 11,850 గొర్రెలు, 2,141 మేకలు ఉన్నాయి. వీటికి సకాలంలో సరైన సేవలు అందించడానికి అనువైన స్థలం, వసతులు, పక్కా భవనం తప్పనిసరి. కానీ ఇప్పటివరకు పక్కా భవనం సమకూరడం లేదు. అంగన్‌వాడీ భవనాన్ని సైతం ఖాళీ చేయాలని ఐసీడీఎస్ అధికారులు ఒత్తిడి తెస్తున్నారు.



పశువులకు చికిత్స అందిస్తున్న సిబ్బంది (ఫైల్)

నోటీసులు ఇచ్చాం..

వెన్నాచేడ్‌లో పశువైద్య కేంద్రం నిర్మాణానికి రూర్బన్ స్కీం కింద రూ. 12లక్షలు మంజూరయ్యాయి. భవన నిర్మాణం పూర్తిచేయాలని చాలాసార్లు గుత్తేదారును కోరినా స్పందించలేదు. ఇటీవల నోటీసు జారీ చేశాం. ఒకవేళ గుత్తేదారు పనులు పూర్తిచేయకపోతే చర్యలు తప్పవు. భవన నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

– హలీం, పంచాయతీరాజ్ ఏఈ, గండేడ్

ఇప్పటికీ అప్పగించలేదు..

అంగన్‌వాడీ భవనం పూర్తయిన తర్వాత మాకు అప్పగించలేదు. గతంలో ఉన్న ఏఈలను అడిగితే మాకేం తెలియదని సమాధానం ఇచ్చారు. గ్రామంలో నాలుగు సెంటర్లు ఉంటే.. ఒక్క దానికి మాత్రమే పక్కా భవనం ఉంది. మిగతా వాటికి లేవు. మా భవనాన్ని మాకు అప్పగించాలని అప్పటి ఏఈని కోరినా స్పందించలేదు. మా భవనాన్ని మాకు అప్పగిస్తే ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని అక్కడ కొనసాగిస్తాం.

– రాధిక, ఇన్‌చార్జి సీడీపీఓ, మహబూబ్‌నగర్

నిధులు లేవంటూ..

అధికారుల నిర్లక్ష్యం, గుత్తేదారు అలసత్వం కారణంగా ఆరేళ్లుగా పశువైద్య కేంద్రం భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతూ వచ్చాయి. రూఫ్ లెవల్ వరకు మాత్రమే భవనం పరిమితమైంది. ఇప్పుడేమో నిధులు లేవంటూ అధికారులు చేతులెత్తేశారు. దీంతో పశువైద్య సిబ్బంది, రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తి నిర్మాణాన్ని తక్షణమే పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- ఎంపీ డీకే అరుణతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ధర్మాపూర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ధర్మాపూర్‌లో ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 50లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైయినేజీ నిర్మాణ పనులకు ఎంపీ డీకే అరుణతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్‌నగర్ అభివృద్ధికి కేంద్రం నుంచి అత్యధిక నిధులు తెచ్చి, మహబూబ్‌నగర్ అభివృద్ధికి సహకరించాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు. ప్రతి గ్రామానికి, తండాలకు సైతం రోడ్లు, కాల్వల నిర్మాణ పనులు తప్పక కల్పించాలనే కృతనిశ్చయంతో ఉన్నామని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు రాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతయ్య పాల్గొన్నారు.

రూ.11.59 కోట్లతో చేపట్టే..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 10, 11, 15, 20, 21, 31, 32, 33, 34, 37, 38, 39వ డివిజన్ల పరిధిలో టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా రూ.11.59 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్, నాయకులు టిన్నీ, సాయిబాబు, రాజు, మోసిన్, మునీరుద్దీన్, ప్రశాంత్‌కుమార్, గంజి వెంకట్రాములు, శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.

కనులపండువగా తిరుమలనాథుడి బ్రహ్మోత్సవాలు

- స్వామివార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ: ర్యాకమకొండ తిరుమలనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం కనులపండువగా నిర్వహించారు. భక్తులు స్థానిక కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివార్లకు దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈఉత్సవాలకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్వామివార్లను దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయల పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలను అందించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్, నాయకులు కృష్ణయ్యయాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదోళ్ల సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి



భట్టుపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్: ప్రజాప్రభుత్వంతోనే పేదోళ్ల సొంతింటి కల సాకారం అవుతుందని ఎమ్మెల్యే జి.మధుసుదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని భట్టుపల్లి గ్రామం ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ ప్రాజెక్ట్ కింద మంజూరు కాగా మద్దె నాగమ్మ ఇంటి నిర్మాణానికి శనివారం సాయంత్రం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. శేరిపల్లి (హెచ్), హస్నాపూర్ గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో భట్టుపల్లి గ్రామానికి ఒక్క డబుల్ బెడ్‌రూం, రేషన్ కార్డు ఇవ్వలేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలకులు చేసిన లక్షల కోట్ల అప్పులకు మిత్తిలు కట్టుకుంటూ, ఎన్నికల వేళ ఇచ్చిన గ్యారంటీలను నెరవేరుస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదల అభ్యున్నతి, రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, భూత్పూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్, రఘుపతిరెడ్డి, భూపతిరెడ్డి, హర్యానాయక్, వెంకటేష్, తిరుపతి రెడ్డి, కిట్టురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ జరిగే వరకు పోరాటం ఆగదు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు పోరాటం ఆగదని ఎంఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మహేష్ అన్నారు. ఈమేరకు పీయూ మెయిన్ గేట్ వద్ద వర్గీకరణ వెంటనే చేపట్టాలని డిమాండ్‌చేస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గణేష్, రాము, కిరణ్‌కుమార్, నాగేందర్ పాల్గొన్నారు.

చిత్తశుద్ధి చాటుకోవాలి

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించిన వెంటనే వర్గీకరణ అమలు చేసి చిత్తశుద్ధి చాటుకోవాలని ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు వెంకటస్వామి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం ఐదో రోజుకు చేరుకున్నాయి.

వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

జడ్చర్ల: ఎస్సీల వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జంగయ్య అన్నారు. జడ్చర్లలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఐదో రోజుకు చేరుకుంది.

వైభవంగా శకటోత్సవం



ఆదిబసవేశ్వరస్వామి దేవాలయం వద్ద కొనసాగుతున్న శకటోత్సవం

నవాబుపేట: మండలంలోని ఆది బసవేశ్వర దేవాలయంలో శనివారం శకటోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభలు ఏర్పాటుచేసి ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లపై ఊరేగించారు.గురుకుంట, పల్లెగడ్డ, కామారం, నవాబుపేట గ్రామాల ప్రజలు ఊరేగింపులుగా దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారి శ్రీశైలం, రాజలింగం, ఉత్సవ నిర్వాహకులు జంగయ్య, రాములు, సత్యం పాల్గొన్నారు.

భజన పోటీలు

ఆదిబసవేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయి భజన పోటీలు దేవాలయ ఆవరణలో ప్రారంభించారు. జిల్లా నుంచి 85 భజన బృందాలు ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు జంగయ్య, వెంకటయ్య తెలిపారు. ఈపోటీలు ఆదివారం కూడా కొనసాగుతాయని వివరించారు.

వస్తువు కొన్నప్పుడు బిల్లు తీసుకోవాలి



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ రవిశంకర్

హన్వాడ: వినియోగదారులు ఏదైనా వస్తువు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ రవిశంకర్ అన్నారు. వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పాపిరెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని టంకరలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రవిశంకర్ మాట్లాడారు. వస్తు సేవలు పొందే ప్రతిఒక్కరూ తమ హక్కులు బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వస్తువుల నాణ్యతను చెక్ చేసుకుని కొనుగోలు చేయాలన్నారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. స్కూల్లో విద్యార్థులకు మరుగుదొడ్లు లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రవికుమార్‌యాదవ్, యోగేశ్వర్‌రాజ్, పీఎల్‌వి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవాబుపేట: మండల కేంద్రంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రత్యేక నిధులు, 'ఉపాధి' నిధుల ద్వార మంజూరైన సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాంచంద్రయ్య, మార్కెట్ డైరెక్టర్ కుమార్ పనులు ప్రారంభించారు. కాగా ఈ రోడ్లతో చాలా ఇబ్బందులుగా ఉన్న ప్రధాన వీధుల్లో రోడ్ల సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, రాజేష్, ఆనంద్, రాజశేఖర్, మణి, పెంటయ్య, వెంకటయ్య, నర్సింహులు, తిర్పతయ్య, మల్లేష్ ఉన్నారు.

శివాంజనేయ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



జడ్చర్ల టౌన్: బూర్గుపల్లి గ్రామంలోని శివాంజనేయ ఆలయ కమిటీ శనివారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేశారు. కమిటీ చైర్మన్‌గా కావలి నాగులు, గౌరవాధ్యక్షుడిగా నర్సింహారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కన్నయ్య, సలహదారులుగా వేణుగోపాల్‌రెడ్డి, చెన్నయ్య, పెద్దగొల్ల మల్లేష్, కుర్వ శ్రీనివాస్, కార్యదర్శి పరమేష్, లక్ష్మయ్య, సభ్యులుగా కృష్ణయాదవ్, గోరంట్ల మల్లేష్, గురువయ్య, బైకని రాములు, రామస్వామి, శంకర్, నరేందర్, శివ, రాములు, నాగయ్య, జంగయ్య, కురుమూర్తి, శ్రీనులు ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు. ఆలయాభివృద్ధికి పాటుపడుతామని నూతన కమిటీ ప్రకటించింది.

కుల వివక్షతపై పోరాడుదాం

- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు



మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణ ప్రాంతాల్లో నేటికీ దళితుల పట్ల కొనసాగుతున్న వివక్షతపై పోరాటాలకు సిద్ధం కావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా స్థాయి సమావేశం సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెల మాణిక్యం రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో దళితుల జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కుల దురహంకార హత్యలు పెట్రేగిపోతున్నాయని, కులాంతర వివాహితుల రక్షణ చట్టం కోరుతూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానించాలన్నారు. ఏప్రిల్ నెలను మహనీయుల మాసంగా ప్రకటించుకొని పూలే, అంబేడ్కర్ జనజాతర నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.కుర్మయ్య మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రాంతాల్లో నేటికీ కులవివక్ష కొనసాగుతుందని, దేవాలయ ప్రవేశం లేని గ్రామాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు ఆది విష్ణువర్దన్, ఎం.బాలరాజు, వెంకట్రాములు, నాగరాజు, శంకర్, మనోహర్, ప్రసాద్, కురుమూర్తి, నర్సిములు, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఏఐ బోధనతో వెనుకబడ్డ విద్యార్థులకు ఉపయోగం



దేవరకద్ర మండలం డోకూర్ పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ బలరాం

దేవరకద్ర: ఏఐ బోధనతో వెనుకబడిన విద్యార్థులకు ఉపయోగపడుతుందని ఎంఈఓ బలరాం అన్నారు. శనివారం మండలంలోని డోకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విద్యాబోధన ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. శరత్‌చంద్ర, సునీత, చందన, శ్రీపాల్‌రెడ్డి, మాధురి, సుందర్‌కుమార్, జయకుమార్ పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా..

చిన్నచింతకుంట: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు స్కూళ్లకు దీటుగా విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని చిన్నచింతకుంట జెడ్పీహెచ్‌ఎస్ కాంప్లెక్స్ జీహెచ్‌ఎం మాధవి అన్నారు. మండలంలోని ఉంధ్యాల గ్రామ ప్రాథమిక పాఠశాలలో, చిన్నచింతకుంట జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రభుత్వం అందించిన కంప్యూటర్లను ఉపాధ్యాయులు, జీహెచ్‌ఎం ప్రారంభించారు. ఉంధ్యాల జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం ఉదయ భాస్కర్, సీఆర్‌పీలు ప్రవీణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీయూ భూములు అమ్మొద్దు



పీయూ మెయిన్ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం సెంట్రల్ యూనివర్సిటీ(సీయూ)లో 400 ఎకరాల భూములను కార్పొరేట్ సంస్థలకు అమ్మవద్దని బీఆర్‌ఎస్వీ నాయకుడు భరత్ అన్నారు. శనివారం పీయూ గేట్ ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ భూములను అమ్ముకోవడం దారుణమన్నారు. ఎకరాల కొద్ది ఉన్న భూముల్లో విలువైన చెట్లు, పశువులు, పక్షులు పెద్ద సంఖ్యలో ఉన్నాయని, వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారనుందని అన్నారు. నాయకులు తిరుమలేష్, ఆంజనేయులు, రామకృష్ణ, మల్లేష్, శశికుమార్ పాల్గొన్నారు.

ఓబీసీ సెల్ పట్టణ కమిటీలో నియామకాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఓబీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు బండి మల్లేష్ ఆధ్వర్యంలో పట్టణ కమిటీలో నియామకాలు చేపట్టారు. ఓబీసీ సెల్ పట్టణ కార్యదర్శిగా పార్వతి సుజిత్‌యాదవ్, సంయుక్త కార్యదర్శిగా ఈ.శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రాజేష్, నరసింహను నియమించారు. ఈ సందర్భంగా వీరికి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, సీనియర్ నాయకుడు ఎన్‌పీ.వెంకటేశ్ నియామకపత్రాలు అందజేశారు. పట్టణ అధ్యక్షుడు బండి మల్లేష్ మాట్లాడారు. జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్, మాజీ కౌన్సిలర్ నాగరాజు, నాయకులు తాహెర్, రాణి, జగదీష్ పాల్గొన్నారు.

దేవాలయానికి విరాళం

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం శనివారం బండ అనసూయమ్మ జ్ఞాపకార్థం బండ రాంరెడ్డి కుమారుడు బండ రంజిత్‌రెడ్డి, మేఘన దంపతులు రూ.25,116 లను విరాళం అందజేశారు. గొల్లశ్రీనివాసులు, జ్యోతి దంపతులు రూ.14,567, గొల్ల నర్సింహులు, సునీతలు రూ.14,567, వినోద్ రూ.14,567ను దేవాలయానికి విరాళమిచ్చారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, పూజారులు నాగరాజు, నాగభూషణం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బీకేరెడ్డికాలనీలోని 'నవరత్నాలు' శిక్షణ కేంద్రంలో మగ్గంవర్క్, బ్యూటీషియన్ కోర్సులకు మహిళలు ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని పర్యవేక్షకులు గుండా మనోహర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌కి చెందిన వారికి ఇక్కడ ఉచితంగా మూడు నెలలపాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నం .08542–252575, 9440410459లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి సన్నబియ్యం వితరణ



చిన్నచింతకుంట: మండలంలోని చిన్న వడ్డేమాన్ గ్రామంలో 'ఆకలి బువ్వ సేవా సమితి' ఆధ్వర్యంలో పేద వృద్ధ మహిళలకు చేపట్టిన నిత్యాన్నదానానికి వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న పాలమూరుకు చెందిన దాతలు మునిమోక్షం నర్సింహులు, నరేందర్, నర్సింహులు కలిసి 75కిలోల సన్నబియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకలి బువ్వ సేవాసమితి చేపట్టిన నిత్యాన్నదాన కార్యక్రమం ఎంతో గొప్పదన్నారు. ఆ సమితి వ్యవస్థాపకుడు రాజేందర్ ఉన్నారు.

తీరని లోఓల్టేజీ సమస్య

జడ్చర్ల టౌన్: విద్యుత్ వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసిన 45రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని స్వయంగా ఫోరం చైర్మన్ ప్రకటించినప్పటికీ ఐదు నెలలుగా సమస్య తీరకుండా ఉందని మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు కౌన్సిలర్ బుక్క మహేష్ తెలియజేశారు. గతేడాది అక్టోబర్ 19న జడ్చర్ల విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినియోగదారుల ఫోరం సదస్సులో కావేరమ్మపేట చావిడి, గుల్సనగర్, హనుమాన్ టెంపుల్ రోడ్‌లో లోఓల్టేజీ సమస్య ఉందని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఏ సమస్య అయినా 45రోజుల్లో తీరుస్తామని ఫోరం చైర్మన్ నాగేశ్వర్‌రావు ప్రకటించారని, అయితే సమస్య మాత్రం నేటికీ తీరటం లేదన్నారు. ఇదే విషయమై స్థానిక డీఈ, ఏఈ, లైన్‌మెన్‌లకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదన్నారు.

పనుల అడ్డగింత

జడ్చర్ల: స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జాతీయ రహదారిని అనుసరించి శనివారం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను మొదలు పెట్టగా వార్డు కౌన్సిలర్లు, భక్తులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఆలయ పూజారులు పనులను మొదలుపెట్టడం సరికాదన్నారు. మూడు దుకాణాలకు సంబంధించిన పనులు పూర్తి చేసి అద్దెకు ఇస్తే ఆలయ నిర్వహణకు కొంత సహకారంగా ఉంటుందన్న భావనతోనే పనులు మొదలు పెట్టామని ఈ సందర్భంగా పూజారులు పేర్కొన్నారు. దేవాలయ కమిటీ నియామకం అనంతరం ఇందుకు సంబంధించి నిర్ణయం తీసుకుందామని, అప్పటివరకు ఎలాంటి పనులు చేయవద్దని కౌన్సిలర్లు శశికిరణ్, జ్యోతి పూజారులకు సూచించ పనులను నిలుపుదల చేయించారు. తీసినపునాది గుంతలను జేసీబీతో పూడ్చి వేయించారు.

నేడు అవగాహన కార్యక్రమం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం గొర్రెల పెంపకందారుల సహకార సంఘ భవనంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జుర్రు నారాయణయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్‌కుమార్‌యాదవ్, ప్రధానకార్యదర్శి సైదులు యాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి కార్యక్రమానికి విద్యావంతులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటయాదవ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, వెంకట్ నర్సయ్య హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

సదస్సు జయప్రదం చేయాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈనెల 18న కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మారుతి అన్నారు. అందుకు సంబంధించిన కరపత్రాన్ని పీయూలో శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం యూజీసీపై తీసుకొచ్చిన ముసాయిదా వల్ల దేశ సమాఖ్యకే దెబ్బ అన్నారు. భాస్కర్, పర్వతాలు, సాయికుమార్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

జడ్చర్ల టౌన్: గంగాపురంలోని హెల్పింగ్‌హార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జెడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు కాలేజీబ్యాగ్, నోట్‌బుక్స్ అందిస్తామన్నారు.

తప్పిన ప్రమాదం

భూత్పూర్: పట్టణంలోని హైవేపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడు ట్రావెల్స్ బస్సులు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ల అప్రమత్తతో ప్రమాదం తప్పింది. బెంగుళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ముందుగా వెళ్తున్న లారీ, వెనుక వస్తున్న ట్రావెల్స్ బస్సు ఆకస్మాత్తుగా బ్రేక్‌లు వేశాయి. దీంతో వెనుకాల వస్తున్న రెండు బస్సులు ఢీకొన్నాయి. దీంతో డ్రైవర్లు చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఘటనాస్థలికి పోలీసులు చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదంపై వాహన దారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ చంద్రశేఖర్ లెలిపారు.